

## మేషం

అశ్విని, భరణి, కృత్తిక 1వ పాదం

**ఆదాయం: 5 వ్యయం: 5**
**రాజపూజ్యం: 3 అవమానం: 1**

**చైత్రం:** ఈ నెలలో గ్రహస్థితి అనుకూలం. ప్రారంభించిన పనులు నిర్విఘ్నంగా కొనసాగుతాయి. ఆర్థికంగా పురోగతి ఉంటుంది. స్నేహితులు, బంధువుల సహకారంతో పనులు పూర్తవుతాయి. ఉద్యోగంలో బాధ్యతలు పెరగవచ్చు.

**వైశాఖం:** వృత్తి, వ్యాపారాల్లో బరువు, బాధ్యతలు పెరుగుతాయి. రావలసిన సొమ్ము చేతికి అందుతుంది. కొత్త పరిచయాల వల్ల సమస్యలు తలెత్తవచ్చు. కొత్త ఒప్పందాలు, ఆర్థిక లావాదేవీల్లో ఏమరుపాటు తగదు.

**జ్యేష్ఠం:** ఈ నెలలో సూర్య సంచారం అనుకూలమైన ఫలితాలను ఇస్తుంది. ఉద్యోగంలో పై అధికారుల మెప్పు లభిస్తుంది. పలుకుబడితో పనులు నెరవేరుతాయి. అనవసరమైన ప్రయాణాలకు దూరంగా ఉండండి.

**ఆషాఢం:** పనులు ఉత్సాహంగా పూర్తి చేస్తారు. రావాల్సిన సొమ్ము వచ్చినా, అనుకోని ఖర్చులు ముందుకురావొచ్చు. వాహనాల మూలంగా ఖర్చులు ఏర్పడవచ్చు. బంధుమిత్రులతో సఖ్యతగా వ్యవహరించండి.

**అధిక-నిజ శ్రావణం:** మంచి ఆలోచనలు వస్తాయి. వృత్తి, వ్యాపారాల్లో స్వల్ప చికాకులు ఎదురైనా ఆలస్యంగా అయినా వాటిని అధిగమిస్తారు. పై అధికారులతో మనస్పర్థలు రావొచ్చు. విద్యార్థులు, ఉద్యోగులు శ్రమకు తగిన ఫలితం పొందుతారు.

**భాద్రపదం:** ఉత్సాహంతో ఉంటారు. పనులు నిరాటంకంగా పూర్తవుతాయి. కుటుంబసభ్యుల ప్రోత్సాహం లభిస్తుంది. అధికారుల ప్రశంసలు అందుకుంటారు. దూర ప్రయాణాల వల్ల కలిసివస్తుంది.

**ఆశ్వయుజం:** స్నేహితులు, బంధువులతో పనులు నెరవేరుతాయి. నెల ద్వితీయార్థంలో పనిభారం పెరగవచ్చు. రావలసిన సొమ్ము ఆలస్యంగా చేతికి అందుతుంది. సర్దుబాట్లు అవసరం పడతాయి. ఆరోగ్య సూత్రాలు పాటించండి.

**కార్తికం:** ఈ నెలలో శుభకార్యాల ప్రయత్నాలు ఫలిస్తాయి. ఆర్థికంగా ఒడుదొడుకులు ఎదురవ్వొచ్చు. ఉద్యోగ, వ్యాపారాల్లో పనిభారం పెరగవచ్చు. ఇంట్లో ప్రశాంత వాతావరణం ఉంటుంది.

**మార్గశిరం:** ఈ నెలలో మిశ్రమ ఫలితాలు ఉంటాయి. సమయానికి తగినట్లుగా నిర్ణయాలు తీసుకుంటూ ముందుకు వెళితే సమస్యలను అధిగమిస్తారు. ఖర్చుల నియంత్రణ అవసరం. స్నేహితుల సహకారం లభిస్తుంది.

**పుష్యం:** ఆరోగ్యం విషయంలో జాగ్రత్తలు తీసుకుంటారు. సంఘంలో గౌరవం పెరుగుతుంది. కొత్త పనులు ప్రారంభిస్తారు. ఫలితాలు సంతృప్తికరంగా ఉంటాయి. కుటుంబసభ్యుల సహకారం ఉంటుంది.

**మాఘం:** చేపట్టిన పనులు సకాలంలో పూర్తవుతాయి. స్వయం ఉపాధిలో అభివృద్ధి ఉంటుంది. ఉద్యోగంలో ప్రమోషన్లకు అవకాశం. అనవసర ఖర్చులు తగ్గించుకోవాలి. శుభకార్య ప్రయత్నాలు ఫలిస్తాయి.

**ఫాల్గుణం:** సమయాన్ని సద్వినియోగం చేసుకుంటే సత్ఫలితాలు పొందుతారు. పిల్లల చదువు, ఉద్యోగం, విదేశీ ప్రయాణాలు అనుకూలిస్తాయి. మంచి వ్యక్తులతో పరిచయాలు ఏర్పడతాయి. ఆస్తి తగాదాలు పరిష్కారం అవుతాయి.

* గురువు, రాహువు, కేతువు అనుగ్రహం కోసం ఆయా గ్రహాలకు జప, క్షీర తర్పణ, హోమ దానాదులు నిర్వహించండి. రుద్రాభిషేకం చేయించండి. ప్రతిరోజూ దుర్గాదేవి స్తోత్రాలు పఠించండి. అప్పుడప్పుడూ మంగళవారాలు సుబ్రహ్మణ్యస్వామి ఆలయానికి వెళ్లండి.



## వృషభం

కృత్తిక 2,3,4, రోహిణి, మృగశిర 1,2 పాదాలు

**ఆదాయం: 14 వ్యయం: 11**
**రాజపూజ్యం: 6 అవమానం: 1**

**చైత్రం:** ఈ నెల మిశ్రమ ఫలితాలు ఉంటాయి. ఆదాయం స్థిరంగా ఉంటుంది. ఆర్థిక సమస్యలు తొలగిపోతాయి. పనుల్లో ఆటంకాలు ఎదురైనా సకాలంలో పూర్తవుతాయి. ఆత్మీయుల సహకారం లభిస్తుంది. పై అధికారుల మెప్పు పొందుతారు.

**వైశాఖం:** శుభకార్య ప్రయత్నాలు ఫలిస్తాయి. కొత్త అవకాశాలు వస్తాయి. ఆదాయం బాగున్నా ఖర్చుల నియంత్రణ అవసరం. పట్టుదలతో పనులు పూర్తిచేస్తారు. ప్రభుత్వ, కోర్టు వ్యవహారాల్లో అనుకూలం.

**జ్యేష్ఠం:** ఈ నెల అనుకూలం. కుటుంబంలో సంతోషాలు వెల్లివిరుస్తాయి. విలువైన వస్తువులు కొనుగోలు చేస్తారు. అన్నదమ్ముల సహకారం లభిస్తుంది. కార్యసిద్ధి ఉంది. పెట్టుబడులకు అనుకూల సమయం.

**ఆషాఢం:** చేపట్టిన పనులు సకాలంలో పూర్తవుతాయి. వృత్తి, వ్యాపారాల్లో అభివృద్ధి ఉంటుంది. రావలసిన డబ్బు చేతికి అందుతుంది. ఆర్థికంగా స్థిరంగా ఉంటుంది. వివాహాది శుభకార్య ప్రయత్నాలు ఫలిస్తాయి.

**అధిక-నిజ శ్రావణం:** శ్రమ అధికం అవుతుంది. కొత్త ఆదాయ మార్గాలను అన్వేషిస్తారు. ఒప్పందాల విషయంలో ఏమరుపాటు తగదు. వ్యాపార భాగస్వాములతో వివాదాలకు దూరంగా ఉండండి. ఆత్మీయులతో మనస్పర్థలకు అవకాశం.

**భాద్రపదం:** పట్టుదలతో పనులు పూర్తిచేస్తారు. ఆదాయం స్థిరంగా ఉంటుంది. అయితే ఖర్చులకు సరిపడా ఉండకపోవచ్చు. ఆరోగ్య సూత్రాలు పాటించండి. ఉద్యోగంలో ఒత్తిడికి లోనవుతారు. వివాదాల్లో తలదూర్చకండి.

**ఆశ్వయుజం:** ఆరోగ్యం విషయంలో శ్రద్ధ అవసరం. ఆదాయాన్ని దృష్టిలో ఉంచుకొని పనులు చేపట్టండి. బంధువులతో వైరం వద్దు. పిల్లల చదువు, విదేశీ ప్రయాణాలు అనుకూలిస్తాయి. క్రయవిక్రయాల్లో జాగ్రత్త.

**కార్తికం:** కొత్త అవకాశాలు వస్తాయి. నలుగురికీ ఉపయోగపడే పనులు చేస్తారు. సంఘంలో పలుకుబడి పెరుగుతుంది. వ్యాపార విస్తరణకు అవకాశం ఉంది. అయితే, ఆర్థికంగా సర్దుబాట్లు తప్పవు. విద్యార్థులకు మంచి కాలం.

**మార్గశిరం:** ఆరోగ్యంపై శ్రద్ధ చూపండి. ఆదాయం క్రమేపీ పెరుగుతుంది. శ్రమకు తగిన ఫలితం పొందుతారు. దూరప్రయాణాలు వాయిదా పడతాయి. శుభకార్యాల్లో పాల్గొంటారు. ఇంట్లో ప్రశాంతత నెలకొంటుంది.

**పుష్యం:** వృత్తి, వ్యాపారాల్లో సంతృప్తిగా ఉంటుంది. సహోద్యోగుల సహకారం లభిస్తుంది. శుభకార్య ప్రయత్నాలు ఫలిస్తాయి. భూలావాదేవీల్లో జాగ్రత్త వహించండి.

**మాఘం:** కలహాలకు దూరంగా ఉండండి. ఆర్థికంగా ఫర్వాలేదు. అనవసర ఖర్చులు తగ్గించుకోండి. మంచివారితో స్నేహం వల్ల కలిసివస్తుంది.

**ఫాల్గుణం:** పనులు సకాలంలో పూర్తవుతాయి. పెండింగ్ సమస్యలకు పరిష్కారం లభిస్తుంది. కుటుంబ సౌఖ్యం ఉంటుంది. పై అధికారుల మన్ననలు పొందుతారు. పలుకుబడితో పనులు నెరవేరుతాయి.

* గురువు, శని, రాహు, కేతు గ్రహాల ప్రీత్యర్థం జప, క్షీర తర్పణ, హోమ, దానాదులు చేయండి. దత్తాత్రేయస్వామి ఆరాధన వల్ల గురువు అనుగ్రహం పొందవచ్చు. తరచూ గురువారాలు మేడిచెట్టుకు ప్రదక్షిణలు చేయండి. శనివారం ఆంజనేయస్వామి ఆలయాన్ని సందర్శించండి. శక్తిమేరకు బీదసాదలకు దానధర్మాలు చేయండి.